క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా గురువారం ఆస్మాన్ ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 నుంచి 8 గంటల వరకు.... తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారానగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్స్ పరిసర ప్రాంతాలు.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు... ఓల్డ్ ఆర్‌టీఏ ఆఫీస్, ఫ్రెండ్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో బుధవారం చార్మినార్ మండలానికి చెందిన ఐదు మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ జానకి, ఆర్ఐలు సాయికిరణ్, మహ్మద్ యూనస్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి’

లింగోజిగూడ: ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తూ తన ఉనికిని చాటుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రజా సమస్యలపై కొంచెం దృష్టి పెట్టాలని లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. గురువారం కర్మన్‌ఘాట్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో జరిగిన ఘటనకు కార్పొరేటర్ దర్పెల్లే కారణమని, కావాలని బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టాలని చూశారని తెలిపారు. అయినా గొడవ జరగకుండా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందరినీ నిలువరించారని, హుందాగా వ్యవహరించాల్సిన మీరు రౌడీల ప్రవర్తించారని ఆరోపించారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం డైరెక్టర్ నర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మన్సూరాబాద్: టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసం వద్ద గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న జక్కిడి చరణ్‌రెడ్డి తెలిపారు. ఒడిశా రైల్వే ప్రమాద బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేయాలని ఆయన కోరారు.

మీకు అండగా ఉంటా

- బస్తీలో ఒక్క ఇటుక కూడా కూలకుండా చూసుకుంటా
- గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ


గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీవాసులకు అండగా ఉంటామని, బస్తీలో ఒక్క ఇటుక కూడా కూలకుండా చూసుకునే బాధ్యత తనదేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బస్తీవాసులకు హామీ ఇచ్చారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ బస్తీలో స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ, తమ ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం జీఓ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్నామని, అయితే 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి వస్తోందన్నారు. అలాగే 58 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారిని కూడా అధికారులు 59 జీఓ కిందకు తీసుకొస్తున్నారని చెప్పారు. తమ ఇళ్లను కూలగొడతారంటూ కొందరు ప్రచారం చేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 59 జీఓ కింద నమోదు చేసుకున్న వారు అధిక రుసుము కట్టాల్సి రావడంతో బస్తీవాసులతో కలిసి రెండు నెలల క్రితమే కలెక్టర్‌ను కలిశామని, అధిక రుసుము వచ్చిన వారికి తక్కువ వచ్చేలా ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. 59 జీఓలో వద్దనుకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే 58 జీఓలో నమోదు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తూ ఇళ్లను కూలగొడతారని బస్తీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. నేను మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, ఖైసర్, దశరథ్, ప్రకాష్, రవి నాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ పేరుతో పేదలను దోచుకుంటున్నారు: బీజేపీ

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్న వారికి నామమాత్రపు ఫీజుతో క్రమబద్ధీకరిస్తామని 58, 59 జీఓలను తీసుకొచ్చిన ప్రభుత్వం వాటిని అడ్డుపెట్టుకుని పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తోందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. 58,59 జీఓలను సక్రమంగా అమలు చేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... నోటిఫైడ్ స్లం ఏరియాలో కేవలం పది శాతం రుసుముతో క్రమబద్ధీకరణ చేయాలని జీఓలో ఉందన్నారు. అయినప్పటికీ మండలంలోని రంగనాయకులగుట్ట, వీరన్నగుట్ట, ముదిరాజ్‌కాలనీ, బంజారాకాలనీల్లో ఉంటున్న పేదలకు లక్షల రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారన్నారు. జీఓ 58 కింద ఉచితంగా రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్ పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి 6 నెలల జైలు

రంగారెడ్డి కోర్టులు: రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో 2015లో నమోదైన అట్రాసిటీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అఖ్తర్ తీర్పు ఇచ్చారు. కోర్టు పీపీ శేరి ప్రతాప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 2015 నవంబర్ 28న ఉదయం బాధితుడు తన ఇంటి పరిసరాల్లో వాకింగ్ చేస్తుండగా నిందితుడు అతడికి ఎదురుగా వచ్చి కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. సాక్షులను విచారించిన మేజిస్ట్రేట్ బుధవారం పైవిధంగా తీర్పు ఇచ్చారు.

ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ అభివృద్ధి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా ఐఎస్ సదన్ డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఐఎస్ సదన్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఆయా ప్రాంతాలవారు తరచూ నిర్మాణ పనులను పరిశీలిస్తుండాలని కార్పొరేటర్ సూచించారు. నాగరాజు, గిరిధర్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ. లక్ష విరాళం

దిల్‌సుఖ్‌నగర్: ఖమ్మం రైల్వే డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మైథిలీ దేవి తన తల్లి పాలూరి త్రిభువన సుందరి దేవి స్మృత్యర్థం అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు బుధవారం లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ డబ్బుతో 2023 -24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ తదితర వస్తువులు కొనుగోలు చేయాలని ఆమె గృహం నిర్వాహకులకు సూచించారు. విద్యా గృహానికి రూ. లక్ష విరాళం ఇచ్చిన మైథిలీ దేవికి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి 21 రోజుల జైలు

చాదర్‌ఘాట్: పక్కింటి మహిళతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయస్థానం 21 రోజుల జైలు శిక్షను విధించింది. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చాదర్‌ఘాట్ కమలానగర్‌కి చెందిన జాఫర్‌ఖాన్ (27) ప్రైవేట్ ఉద్యోగి. అతను పక్కింటి మహిళతో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు రావటంతో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కేసు వివరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడు జాఫర్‌ఖాన్‌కు 21 రోజులు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

‘ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలి’

మన్సూరాబాద్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఎల్‌బీనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చొక్కమ్మ, రాములమ్మ, లావణ్య, లలిత, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు

మలక్‌పేట ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: కాలనీల్లో పార్కుల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం ఆయన మూసారంబాగ్ డివిజన్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో తిరిగి సమస్యలు పరిశీలించారు.పార్కులో గ్రీనరీ, వాకింగ్ పాత్, పిల్లలకు ఆట పరికరాలు, వాటర్ ఫౌంటేయిన్, మహిళలకు టాయిలెట్స్, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన పార్కులో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని జీహెచ్‌ఎంసీ, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే, వీరభద్రీయ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ వీర్‌సింగ్, ఏఈ రవికాంత్, స్ట్రీట్‌లైట్స్ ఏఈ రాజు, వాటర్ వర్క్స్ డీజీఎం శీలారాణి తదితరులు పాల్గొన్నారు.

శివమ్మనగర్‌లో కొత్త విద్యుత్ స్తంభాలు వేయండి

నాగోలు: కొత్తపేట డివిజన్ శివమ్మనగర్ కాలనీలో గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని వెంటనే కొత్త స్తంభాలు వేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శివమ్మ నగర్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ ఏఈ మాత్రు నాయక్, ఎలక్ట్రికల్ ఏఈతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలోని రోడ్లు పడైపోయాయని, కొత్తగా సీసీ రోడ్లు వేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలు పాతవి అయిపోయి కూలిపోయేలా ఉన్నాయన్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఎలక్ట్రికల్ ఏఈని కోరారు. నాయకులు మోతీలాల్ నాయక్, రవి నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ బాలాజీనగర్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలతో పాటు కాలనీ ప్రధాన రహదారి ఆర్చ్‌కు ఇరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. బుధవారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుద్దా లచ్చిరెడ్డి, సభ్యులు సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

హయత్‌నగర్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఓ దొంగను బుధవారం హయత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం గోసుకొండ గ్రామానికి చెందిన వరికుప్పల శివకృష్ణ (30) కొంతకాలంగా చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. గతనెల 31 హయత్‌నగర్ ఠాణా పరిధిలోని ప్రగతినగర్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మి అనే మహిళ మెడలోని 28 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి శివకృష్ణను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 28 గ్రాముల బంగారు గొలుసు, ఒక సెల్ ఫోన్, బైకును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇతడిని గత ఏప్రిల్ 8న చైన్‌స్నాచింగ్ కేసులో అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపగా బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.